క్లుప్తంగా

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించండి



మాట్లాడుతున్న జడ్జి దివ్య

పత్తికొండటౌన్: బాలికలు చదువుతో పాటు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జూనియర్ సివిల్‌జడ్జి వి.దివ్య సూచించారు. శనివారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక చక్రాళ్ల రోడ్డులోని కస్తూర్బా విద్యాలయంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించడంతో పాటు, విద్యార్థినులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి వి.దివ్య మాట్లాడుతూ పాఠశాలల్లో ఉచిత విద్యతో పాటు, అన్ని రకాల వసతులు ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. క్రమశిక్షణతో చదువుకుని ఉన్నతస్థానాలకు ఎదగాలన్నారు. ప్రభుత్వ వైద్యాధికారులు కల్పన, ఆదినాగేశ్ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది విద్యార్థినులకు వైద్యపరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఓ షభానా, లోక్‌అదాలత్ క్లర్క్ రమాదేవి పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలు తాకొద్దు

ఆలూరు రూరల్: విద్యుత్ స్తంభాలను తాకవద్దని ఆలూరు విద్యుత్ ఏఈ లోకేష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అర్తింగ్ కారణంగా విద్యుత్ స్తంభాల్లో విద్యుత్ సరఫరా అవుతోందన్నారు. రైతులు పొలాల్లో ఉన్న స్తంభాలను ముట్టుకోవడం, వైర్లను సరిచేయడం, మరమ్మతులకు గురైన మోటార్లు, స్టాటర్లను రిపేరి చేయడం వంటివి చేయరాదన్నారు. విద్యుత్ సరఫరాలో సమస్య వస్తే సంబంధిత లైన్‌మెన్‌కు సమాచారం అందించాలన్నారు. చిన్నారులను స్తంభాల వద్దకు వెళ్లకుండా చూడాలన్నారు. వర్షాలు, ఈదురుగాలులకు స్తంభాలు నేలకొరిగినా, వైర్లు కింద పడినా వెంటనే 9440813390 నంబర్‌కు కాల్ చేయాలన్నారు.

బంద్‌ను జయప్రదం చేయండి

గోనెగండ్ల: విద్యారంగ సమస్యల పరిష్కారం విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 25న చేపట్టనున్న విద్యాసంస్థల రాష్ట్ర బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐఎస్‌ఎఫ్, టీఎన్‌ఎస్‌ఎఫ్, డీఎస్‌ఎఫ్, ఆర్‌వీఎఫ్ నాయకులు మునిస్వామి, బొగ్గు రమేష్, ప్రతాప్, చిన్న, మనోహర్ కోరారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజు దోపిడీని అరికట్టాలనే తదితర డిమాండ్ల పరిష్కారం కోసం చేపట్టనున్న బంద్‌కు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యలు సహకరించాలన్నారు. సమావేశంలో విద్యార్థి సంఘాల నాయకులు జిలాని, కృష్ణ, షేక్షావలి, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

హొళగుంద: విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఈ నెల 25న చేపట్టనున్న విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐఎస్‌ఎఫ్, టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు సతీష్‌కుమార్, మల్లికార్జున కోరారు. శనివారం వారు బంద్‌కు సంబంధించి కరపత్రాలను విడుదల చేశారు.

శాంతియుతంగా నిర్వహించుకోవాలి

మద్దికెర: మొహరం పండుగను ప్రజలు శాంతియుతంగా నిర్వహించుకోవాలని ఎస్‌ఐ మహమ్మద్ రిజ్వాన్ శనివారం తెలిపారు. కుల, మతాలకు అతీతంగా నిర్వహించుకునే పండుగలో ఎవరైనా అల్లర్లకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు.

ఐక్యతతోనే హక్కుల సాధన



వేదికపై అభివాదం చేస్తున్న ముస్లింలు

ఎమ్మిగనూరుటౌన్: ఐక్యతతోనే ముస్లిం మైనారిటీల హక్కులను సాధించుకోవచ్చని ముస్లిం మైనారిటీ హక్కుల ఐక్య వేదిక నాయకులు అన్నారు. శనివారం కుర్ణి కళ్యాణ మండపంలో ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన రాజకీయ చైతన్య సదస్సులో ఐక్యవేదిక నాయకులు ఫారుక్ సిబ్లి, మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు, బడేసా, సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ల దొంగ అరెస్ట్



ట్రాక్టర్, దోజర్‌తోపాటు నిందితున్ని చూపుతున్న ఎస్‌ఐ సురేష్

కృష్ణగిరి: ట్రాక్టర్లు చోరీ చేసి తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి కటకటాలకు పంపారు. ఎస్‌ఐ సురేస్ తెలిపిన వివరాలు.. మూడు రోజుల క్రితం మండల పరిధిలోని అమకతాడు గ్రామ శివారులోని వీరబ్రహ్మేంద్ర స్వామి గుడి వద్ద ఉన్న ట్రాక్టర్, దోజర్ చోరీకి గురైంది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. నంద్యాల జిల్లా డోన్ మండలం కమలాపురం గ్రామానికి చెందిన వడ్డే కంబగిరి రాముడు అమకతాడు టోల్‌ప్లాజా వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో విచారించగా నేరం అంగీకరించడంతో అతడిని అరెస్ట్ చేసి, ట్రాక్టర్, దోజర్‌ను స్వాధీనం చేసుకున్నారు. కాగా ఇతడిపై గతంలో బేతంచెర్ల, కర్నూలు–4 టౌన్‌లో చోరీ కేసులు నమోదై ఉన్నట్లు సమాచారం.

గుడినే మింగేశాడు!

- పురాతన ఆంజనేయస్వామి ఆలయంపై రెండంతస్తుల మేడ
- ఓ మత గురువు కుటుంబం ఘనకార్యం
- భగ్గుమంటున్న హిందూ ధార్మిక సంఘాలు
- సొంత మత పెద్దలు కూడా తప్పుబడుతున్న వైనం
- చేష్టలుడిగిన అధికారులు



పత్తికొండలోని ఆంజనేయస్వామి ఆలయంపై నిర్మించిన రెండంతస్తుల మేడ



ఆలయంలోని ఆంజనేయస్వామి మూల విరాట్

పత్తికొండ రూరల్: పట్టణంలోని రెడ్డి బావి వీధిలోని పురాతన ఆంజనేయస్వామి ఆలయంపై ఆక్రమణకు గురైంది.ఓ మత గురువు కుటుంబం ఇలా గుడిపై అక్రమ కట్టడాన్ని నిర్మించి వివాదాన్ని సృష్టించడాన్ని ముస్లిం వర్గాలు సైతం తప్పుబడుతున్నాయి.

స్థానిక రెడ్డి బావి వీధిలో 1050 సంవత్సరంలో అప్పటి రాజులు ఆంజనేయస్వామి ఆలయాన్ని నిర్మించారు. ఎంతో ప్రసిద్ధి చెందిన శివాలయానికి ఎదురుగా ఉన్న బావిలోని భక్తులు, కాళ్లు చేతులు శుభ్రం చేసుకుని ఆంజనేయస్వామిని దర్శించుకుని, శివాలయానికి చేరుకునేవారు. ప్రత్యేక రోజుల్లో బావి భక్తుల కోలాహలంతో సందడిగా కనిపించేది. కాలక్రమేణా బావిలో నీళ్ల అడుగంటిపోయి చెత్తాచెదారంతో నిండిపోయింది. పురాతన ఆలయం కూడా దెబ్బతింది. ఇదే అదునుగా తీసుకున్న ఓ మత గురువు మొదట్లో ఆలయం చుట్ట పక్కల గోడలు నిర్మించాడు. కొన్నేళ్లు అలాగే ఉంచాడు. ఎవరూ గమనించకపోవడతో మొదటి అంతస్తు నిర్మించాడు. మరి కొంతకాలానికి రెండో అంతస్తు నిర్మాణానికి పూనుకున్నాడు. ఇక్కడ ఆలయం ఉందన్న విషయాన్ని మరిపించేలా ఏకంగా రెండతస్తుల మేడను మత గురువు కుటుంబం నిర్మిస్తున్నా పంచాయతీ అధికారులు గమనించకపోవడం బట్టి చూస్తే వారి నిర్లక్ష్యం ఏపాటిదోనని పలువురు ఆరోపిస్తున్నారు.

తూతూ మంత్రం చర్యలు

ఆలయంపై వెలసిన అక్రమ కట్టడాన్ని చూసి జనం ముక్కున వేలేసుకుంటున్నారు. అక్రమ కట్టడాలపై ఆగమేఘాలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఇంతపెద్ద అక్రమ కట్టడాన్ని చూసీచూడనట్లు వదిలివేయడంపై హిందూ ధార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికే విశ్వహిందూ పరిషత్, భజరందళ్, ఆర్యవైశ్యసంఘం, ఆంజనేయస్వామి భక్తాదులు, వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. నిర్మాణాన్ని నిలుపుదల చేసి పంచాయతీ అధికారులు చేతులు దులిపేసుకున్నారు. అక్రమ కట్టడం కూల్చివేతపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మీనమేషాలు లెక్కిస్తూ అక్రమార్కులకు వంత పాడుతున్నట్లు తెలుస్తోంది. కాగా హిందువుల మనోభావాలు దెబ్బితినేలా ఓ వ్యక్తి సృష్టించిన సమస్య నివురుగప్పిన నిప్పులా ఉంది. ఏక్షణమైనా ఉద్రిక్తతకు దారితీసే అవకాశం కనిపిస్తోంది.సమస్య మరింత జఠిల కాకముందే సంబంధిత అధికారులు అక్రమ కట్టడాన్ని కూల్చేసేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఆలయంపై అక్రమ కట్టడాన్ని కూల్చివేయాలి



హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా పురాతన ఆలయంపై ఓ మత గురువు అక్రమ కట్టడానికి పూనుకోవడం దారుణం. మతపరమైన విద్వేషాలు సృష్టించేందుకు ఆజ్యం పోస్తున్నట్లుగా కనిపిస్తోంది. ఆలయంపై అక్రమంగా నిర్మించిన ఇంటిని కూల్చివేయాలి. లేదంటే హిందూ ధార్మిక సంఘాలతో కలిసి 'చలోపత్తికొండ' కార్యక్రమం నిర్వహించి ఆందోళనలకు దిగుతాం

– వీరరాజులు, విశ్వహిందూ పరిషత్ తాలూకా అధ్యక్షుడు, పత్తికొండ

ఇంటి నిర్మాణానికి అనుమతి ఇవ్వలేదు

ఆలయంపై ఉన్న ఆక్రమిత కట్టడమే కాదు ముందుభాగంలో ఇంటిని నిర్మించుకోవడానికి కూడా గ్రామ పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతి ఇవ్వలేదు. పురాతన ఆలయంపై ఇల్లు కట్టేందుకు వీలు లేదు. ఆలయంపై కట్టడాన్ని నిలిపేశాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు చేపడతాం.

– నరసింహులు, ఈఓ, మేజర్ పంచాయతీ, పత్తికొండ

చిరుత దాడిలో గేదే మృతి

ఆస్పరి: మండలంలోని బైలుపత్తికొండ గ్రామంలో శుక్రవారం రాత్రి చిరుత ఓ గేదెపై దాడి చేసి చంపేసింది. గ్రామానికి చెందిన రైతు కురువ సుంకన్న తన ఇంటి పక్కనే ఉన్న వామిదొడ్డిలో గేదెను కట్టేశాడు. అదే రాత్రి చిరుత గేదెను చంపి కొద్ది దూరంలో ఉన్న గుట్టపైకి తీసుకెళ్లి తినేసింది. శనివారం గ్రామస్తులు గుర్తించి భయాందోళనకు గురయ్యారు. పొలాలకు వెళ్లేందుకు రైతులు, కూలీలు భయపడుతున్నారు. ఇప్పటికే సమీపంలోని ములుగుందం, హలిగేర, తొగలుగల్లు, కలపరి, యాటకల్లు, తురువగల్లు గ్రామాల కొండల్లో జింకలు, కుక్కలు, మేకలు, వానరాలపై చిరుత దాడి చేసి చంపేసింది. ఇప్పుడు ఏకంగా బైలుపత్తికొండలో గ్రామంలోకే వచ్చి గేదెను ఎత్తుకెళ్లడంతో మరింత ఆందోళన చెందుతున్నారు. ఫారెస్టు అధికారులు మాత్రం హలిగేర, తురువగల్లు గ్రామాలకు వెళ్లి చిరుత సంచరిస్తున్న కొండలను పరిశీలించి జాగ్రత్తగా ఉండాలని ఆయా గ్రామస్తులకు చెప్పి వెళ్లారు. కాగా చిరుతను బంధించి వేరే ప్రాంతానికి తీసుకెళ్లాలని ఆయా గ్రామాల ప్రజలు ఫారెస్టు అధికారులను కోరుతున్నారు.

చిరుతను తరిమిన కుక్కలు

ఎమ్మిగనూరురూరల్: గొర్రెల మంద వద్దకు వచ్చిన చిరుతను కుక్కలు తరిమేసినట్లు మల్కాపురం గ్రామ గొర్రెల కాపరులు ధనుంజయ, బోయ పెద్దయ్య తెలిపారు. మల్కాపురం – కోటేకల్ గ్రామాల మధ్య వంక పక్కన తమ గొర్రెల మందను శుక్రవారం రాత్రి నిద్రకు ఉపక్రమించామన్నారు. అర్ధరాత్రి కుక్కలు అరుస్తుండటంతో నిద్రలేచిన చూడగా చిరత కనిపించిందన్నారు. తాము కేకలు వేయటంతో కుక్కలు చిరుతను తరిమివేశాయన్నారు. చిరుత కొండల్లోకి పారిపోయిందని చెప్పారు. కోటేకల్, దేవబెట్ట, మల్కాపురం కొండల్లో మూడు నుంచి నాలుగు చిరుతలు సంచరిస్తున్నాయని, ఆయా గ్రామాల ప్రజలు చెపుతున్నారు.

ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రిపై విజి'లెన్స్'



రికార్డులు పరిశీలిస్తున్న విజిలెన్స్ సీఐ నాగరాజుయాదవ్

ఎమ్మిగనూరురూరల్: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో విజిలెన్స్ అధికారుల శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు తనిఖీలు నిర్వహించారు. డాక్టర్లు సమయానికి వస్తున్నారా.. రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారా.. తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ సీఐ నాగరాజు యాదవ్ మాట్లాడుతూ.. ప్రభుత్వాసుపత్రిలో వైద్య సేవలు బాగా అందుతున్నాయని తమ పరిశీలనలో తేలిందన్నారు. రోగుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాలేదన్నారు. సమస్యలను డాక్టర్లను అడిగి తెలుసుకున్నామని, ప స్థాయి అధికారులకు నివేదిక అందచేస్తామని తెలిపారు. ప్రభుత్వాసుపత్రి ఆవరణలోని మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జనరిక్ మందుల మెడికల్ షాప్‌లో తనిఖీ చేశామని, ఇందులో రూ. 40 వేల విలువ చేసే కాలం చెల్లిన మందులు పట్టుబడినట్లు చెప్పారు. కాలం చెల్లిన మందులను సీజ్ చేసి డీఎం అండ్‌హెచ్‌వో తెలియచేస్తామని తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఎస్‌ఐ హనుమంతయ్య, ఏఈ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వేగంగా ఓటరు జాబితా సవరణ సర్వే



హొళగుంద మండలం ఎల్లార్తిలో ఓటరు జాబితా సవరణ సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ హుసేన్‌సాహెబ్

వెల్దుర్తి: ఓటరు జాబితా సవరణ సర్వే వేగంగా సాగుతోందని పత్తికొండ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్‌డీఓ మోహన్ దాస్ తెలిపారు. శనివారం ఆయన మండలంలో జరుగుతున్న సర్వేపై తహసీల్దార్ శివరాముడు, డీటీ ప్రసాద్‌రాజులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1500లకు పైన ఓటర్లు ఉన్న బూత్‌లను గుర్తించి అదనపు బూత్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఓటరు జాబితా సవరణ సర్వే ద్వారా బోగస్ ఓటర్లను తొలగిస్తున్నామన్నారు. బీఎల్‌ఓలకు ప్రజలు సహకరించాలని కోరారు.

దేవనకొండ: ఓటర్ నమోదును పగడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ వెంకటేష్‌నాయక్ బీఎల్‌ఓలను ఆదేశించారు. శనివారం బీఎల్‌ఓలకు ఆయన పలు సూచనలిచ్చారు.

హొళగుంద: మండలంలోని ఎల్లార్తి గ్రామంలో జరుగుతున్న ఓటరు జాబితా సవరణ సర్వేను తహసీల్దారు హుసేన్‌సాహెబ్ పరిశీలించారు. పకడ్బందీగా చేపట్టాలని బీఎల్‌ఓలకు సూచించారు.

గోనెగండ్ల:మండల కేంద్రంలోని లక్ష్మిపేటలో సాగుతున్న ఓటరు నమోదు సర్వేను తహసీల్దార్ వేణుగోపాల్ తనిఖీ చేశారు. అవకతకలకు తావు లేకుండా సర్వే చేపట్టాలని బీఎల్‌ఓలకు సూచించారు.

నందవరం: మండలం కేంద్రంలో కొనసాగుతున్న ఓటరు జాబితా సవరణ సర్వేను తహసీల్దార్ నిత్యానందరాజు పరిశీలించారు. ఆగస్టు 20వ తేదీ వరకు సవరణ కార్యక్రమం ఉంటుందని బీఎల్‌ఓలకు ప్రజలు సహకరించాలని కోరారు.

ఎమ్మిగనూరుటౌన్: మున్సిపల్ సమావేశ మందిరంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ గురురాజారావుతో కలిసి బీఎల్‌ఓలు, వార్డు సచివాలయ సిబ్బంది, సూపర్ వైజర్లతో తహసీల్దార్ ఆంజనేయులు సమావేశమయ్యారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు.

ప్రభుత్వాసుపత్రిలో మగశిశువు మృతి

- శిశువు కుటుంబ సభ్యుల ఆందోళన



మృతి చెందిన శిశువును చూపుతున్న బంధువులు

ఎమ్మిగనూరు రూరల్: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో శనివారం సాయంత్రం మూడు రోజుల మగ శిశువు మృతి చెందటంతో కుటుంబ సభ్యులు కాసేపు ఆందోళనకు దిగారు. పోలీసులు సర్దిచెప్పడంతో సమస్య సద్దుమణిగింది. బాధితులు తెలిపిన వివరాలు.. దేవనకొండ మండలం తెర్నేకల్ గ్రామానికి చెందిన మన్సూర్ తన భార్య షాజహాన్‌కు పురిటి నొప్పులు రావటంతో ఆరు రోజుల క్రితం ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రిలో చేరారు. మూడు రోజుల తర్వాత సిజేరియన్‌లో మగబిడ్డకు జన్మనిచ్చింది. పుట్టినప్పుడు ఆరోగ్యంగా ఉన్న శిశువుకు శుక్రవారం జ్వరం రావటంతో వైద్యులు రక్త పరీక్షలు చేశారు. రిపోర్టులు నార్మల్‌గా ఉండటంతో శనివారం ఉదయం వైద్యం చేయడంతో బిడ్డ బాగానే ఉన్నాడు. కాగా మధ్యాహ్నం 3 గంటల తరువాత కదలిక లేకపోవడంతో డాక్టర్‌కు చూపించగా అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. దీంతో వైద్యుల నిర్లక్ష్యం కారణాంగానే తమ బిడ్డ చనిపోయాడని శిశువు బంధువులో వాగ్వాదానికి దిగారు. ఇదే విషయమై డాక్టర్ శ్రీచరణ్‌రెడ్డి మాట్లాడుతూ బిడ్డ ఉదయం ఆరోగ్యంగానే ఉన్నాడని, తల్లి పడుకొని పాలు ఇవ్వటం వల్ల ఊపిరితిత్తుల్లోకి చేరి ఊపిరాడక మృతి చెంది ఉండవచ్చునని తెలిపారు. తాము అందుబాటులోనే ఉన్నామని, ఏ సమస్య వచ్చినా వెంటనే స్పందిస్తామని శిశువు మృతి విషయంలో తమ తప్పు లేదని అన్నారు. పట్టణ పోలీసులు అక్కడికి చేరుకుని సర్దిచెప్పడంతో శిశువు బంధువులు ఆందోళన విరమించారు.

నకిలీ మందులు విక్రయిస్తే చర్యలు



గోనెగండ్లలో వేదశ్రీ ట్రేడర్స్‌లో తనిఖీ చేస్తున్న వ్యవసాయ అధికారులు

గోనెగండ్ల: నకిలీ మందులు, నాసిరకం ఇత్తనాలు రైతులకు అంటగడితే చర్యలు తప్పవని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ వెంకటేశ్వర్లు, ఎమ్మిగనూరు ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, వ్యవసాయ అధికారి శశిధర్ హెచ్చరించారు. శనివారం వారు మండల కేంద్రంలోని ధరణి ఏజెన్సీస్, బడేసావలి ట్రేడర్స్, ముబారక్ ట్రేడర్స్, వేదశ్రీ ట్రేడర్స్, హెచ్. కైరవాడిలో వైష్ణవి ట్రేడర్స్‌ను తనిఖీ చేశారు. రికార్డులు రిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విత్తన డీలర్లు ఫారం సీ సోర్స్ సర్టిఫికెట్స్‌ను కలిగి ఉండాలన్నారు. ప్రతి రోజు ధరల పట్టిక, నిల్వల బోర్డును ప్రదర్శించాలన్నారు. కొనుగోలు చేసిన ప్రతి రైతుకు బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. బిల్లుపై రైతు సంతకం ఉండాలన్నారు. ఎమ్మార్పీ మించి అమ్మకాలు చేయరాదన్నారు. ప్రభుత్వ అనుమతులున్న విత్తనాలను మాత్రమే విక్రయించాలని, నిషేధిత విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతినెలా 5 లోపు క్రయ విక్రయాల నివేదిక కార్యాలయంలో సమర్పించాలన్నారు.

మద్దికెర: స్థానిక ఫర్టిలైజర్ షాపులను ఏఓ రవి తనిఖీ చేసి బిల్లు, రికార్డులు పరిశీలించారు. రైతులకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని, రికార్డులు సక్రమంగా నిర్వహించుకోవాలని, నిషేధించిన మందు లు అమ్మవద్దని షాపు యజమానులకు ఏఓ సూచించారు.

పుస్తకాలొచ్చేశాయ్!

- నెలన్నర ముందే విద్యార్థులకు అందజేత



కృష్ణగిరి మండలం ఎరుకలచెర్వు హరిజనవాడ పాఠశాలలో పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం



వెల్దుర్తి మండలం కృష్ణాపురం ఎంపీపీ స్కూల్‌లో పుస్తకాలు చూపెడుతున్న విద్యార్థులు

ఆలూరు రూరల్: నెలన్నర ముందే విద్యార్థులకు సెమిస్టర్ –2 పుస్తకాలు అందాయి. ఆలూరు, ఎమ్మిగనూరు, పత్తికొండ నియోజకవర్గాల వ్యాప్తంగా ఆయా పాఠశాలల్లో హెచ్‌ఎంలు శనివారం విద్యార్థులకు పుస్తకాలు అందజేయడంతో పండగ వాతావరణం నెలకొంది. ఆలూరు మండలంలోని 51 ప్రభుత్వ పాఠశాలల్లో 9,196 మంది విద్యార్థులకు 24,441 పాఠ్య పుస్తకాలు అందజేశారు.

కృష్ణగిరి: మండల వ్యాప్తంగా 46 ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం సెమిస్టర్–2 పుస్తకాలను విద్యార్థులకు అందజేసినట్లు ఎంఈఓ–2 మద్దయ్య తెలిపారు. 1 నుంచి 9వ తరగతి చదువుతున్న 6,800 మంది విద్యార్థులకు 20,116 పుస్తకాలను అందజేశామన్నారు.

మద్దికెర: మండల పరిధిలోని ఎం.అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శనివారం సెమిస్టర్–2 పుస్తకాలు పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ మహేష్‌రెడ్డి, ఎంఈఓ గోపాల్ పాల్గొని బాగా చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. హెచ్‌ఎం ఫరూక్ పాల్గొన్నారు.

వెల్దుర్తి: మండల పరిధిలోని పాఠశాలలకు సెమిస్టర్–2 పుస్తకాల పంపిణీ పూర్తయిందని ఎంఈఓ–2 రమేశ్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ 8 ఎండీయూ వాహనాల ద్వారా పాఠశాలలకు చేర్చామన్నారు.

నందవరం: మండలానికి 27 వేల సెకండ్ సెమిస్టర్ పుస్తకాలు మంజూరయ్యాయని ఎంఈఓ సుదర్శన్ రెడ్డి తెలిపారు. శనివారం ముగతి మోడల్ స్కూల్‌లోని పుస్తకాలను సీఆర్‌పీలు రేషన్ వాహనంలో పాఠశాలలకు తరలించి హెచ్‌ఎంల చేత విద్యార్థులకు పంపిణీ చేయించారన్నారు.

సమస్యల పరిష్కారానికే 'సురక్ష'





ఎమ్మిగనూరులో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ కెఎస్ రఘు, తెర్నేకల్‌లో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంపీడీఓ గౌరీదేవి, ప్రజాప్రతినిధులు

దేవనకొండ: సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని తహసీల్దార్ వెంకటేష్‌నాయక్, ఎంపీడీఓ గౌరీదేవి అన్నారు. శనివారం మండలంలోని తెర్నెకల్‌లో ఎంపీడీఓ గౌరీదేవి టీం, పాలకుర్తిలో తహసీల్దార్ వెంకటేష్‌నాయక్ టీం జగనన్న సురక్ష సదస్సులను నిర్వహించి పలువురికి సర్టిఫికెట్లె అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాల ద్వారా పరిష్కారం కాని సమస్యలు ఉంటే సదస్సుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. తెర్నెకల్ సర్పంచ్ అరుణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి రాముడు, నాయకులు లుముంబా, రాజు పాల్గొన్నారు.

ఆస్పరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం పేదలకు అండగా నిలుస్తోందని ఎంపీపీ సుంకుర ఉమాదేవి అన్నారు. శనివారం మండలంలోని తంగరడోణ, శంకరబండ గ్రామాల్లో సర్పంచులు శంకరమ్మ, విజయలక్ష్మి, నాగమ్మ అధ్యక్షతన తహసీల్దార్ కుమారస్వామి, ఎంపీడీఓ రాణెమ్మ సర్టిఫికెట్ల పంపిణీ చేశారు.

ఎమ్మిగనూరుటౌన్: జగనన్న సురక్ష కార్యక్రమంతో పేదలకు ఎంతో మేలు చేకూరుతోందని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కెఎస్ రఘు, కమిషనర్ గంగిరెడ్డి అన్నారు. పట్టణంలోని వీవర్స్‌కాలనీ సచివాలయంలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష సదస్సులో వారు పాల్గొని పలువురికి ధ్రువీకరణ పత్రాలను వార్డు కౌన్సిలర్ నీలకంఠతో కలిసి అందజేశారు.

గోనెగండ్ల: ఐరన్‌బండ, గోనెగండ్ల–3 సచివాలయం పరిధిలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగేష్, తహసీల్దార్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష సదస్సులు నిర్వహించి పలువురికి సర్టిఫికెట్లు అందజేశారు. మాజీ కోఆప్షన్ మెంబర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు బందె నవాజ్, జేసీఎస్ మండల కన్వీనర్ మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

డ్రైనేజీ సమస్య పరిష్కరించండి

ఆలూరు రూరల్: స్థానిక కోట వీధిలో నెలకొన్న డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని కాలనీ వాసులు పంచాయతీ ఏఓ కృష్ణకుమార్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన శనివారం సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. మురుగు కాలువ నీరు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో పక్కనే ఉన్న భీమలింగేశ్వర ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందిగా మారిందని స్థానికులు వివరించడంతో రెండు రోజుల్లో పరిష్కరిస్తామని ఏఓ హామీ ఇచ్చారు.

దోమ కాటు బారిన పడొద్దు

మద్దికెర: దోమ కాటు బారిన పడకుండా ప్రతిఒక్కరూ దోమ తెరలు వాడాలని ప్రభుత్వ వైద్యాధికారి నగేష్ సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తుండటంతో నీరు నిలిచి దోమలు వ్యాప్తి చెందుతాయన్నారు. దోమ కాటు వల్ల డెంగీ, మలేరియా తదితర వ్యాధులు ప్రబలే ప్రమాదముందన్నారు.

మణిపూర్ నిందితులను ఉరి తీయాలి

ఎమ్మిగనూరుటౌన్: మణిపూర్‌లో మహిళలను వివస్త్ర చేసి ఊరేగించిన ఘటనలో నిందితులను బహిరంగంగా ఉరి తీయాలని ప్రజాసంఘాల నాయకులు రామతీర్థం అమరేష్, నరసన్న, రంగయ్య బతుకమ్మ, లక్ష్మీనారాయణ, ఎర్రన్న, ప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం వారు ఎస్‌పీపీ అతిథి గృహం నుంచి సోమప్ప సర్కిల్ వరకు ర్యాలీ చేపట్టి నిందితులపై చర్యలు తీసుకోవడంలో విఫలమైన ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహనం చేశారు.

రేపు 'గడప గడపకు మన ప్రభుత్వం'

తుగ్గలి: మండల పరిధిలోని లింగనేనిదొడ్డి, బొందిమడుగుల గ్రామాల్లో సోమవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల, సచివాలయ కన్వీనర్లు జిట్టా నాగేష్‌యాదవ్, హనుమంతు తెలిపారు. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పాల్గొని ప్రభుత్వ పథకాల అమలు తీరు, ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటారన్నారు.

పనుల్లో నాణ్యత పాటించండి

ఆలూరు: బీటీ రోడ్లు పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్లకు క్వాలిటీ కంట్రోలర్ పీఆర్ డీఈ హెచ్.డీ. ఈరన్న సూచించారు. అనంతరం పురం జిల్లా గుంతకల్లు నుంచి కొట్టాల గ్రామం మీదుగా చిప్పగిరి మండలం గుమ్మనూరు గ్రామం వరకు రూ.5 కోట్లతో నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులను పీఆర్ డీఈ శ్రీరాములు, జేఈ చౌడారెడ్డితో కలిసి శనివారం ఆయన పరిశీలించారు.

సకాలంలో సేవలు అందించండి

కృష్ణగిరి: ఆర్‌బీకేల ద్వారా రైతులకు సకాలంలో సేవలు అందించాలని పత్తికొండ ఏడీఏ మోహన్ విజయకుమార్ ఆదేశించారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో శనివారం ఏఓ వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన ఆర్‌బీకేల అగ్రికల్చర్ అసిస్టెంట్లతో సమావేశమై పలు సూచనలు ఇచ్చారు.